క్లుప్తంగా

తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్థిక, సామాజిక, కుల గణన సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు చేయాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఎంఆర్సీ సెంటర్, ఏకలవ్య మోడల్ పాఠశాలలో చేపడుతున్న సర్వే ఆన్‌లైన్ పనులను ఆయన ఎంపీడీవో జవహర్‌తో కలిసి పరిశీలించారు. ఆన్‌లైన్ వివరాల నమోదులో వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో స్వప్నశీల, తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలి

నేరడిగొండ: మండలంలో పలు అభివృద్ధి పనులను అప్పులు చేసి పూర్తి చేశామని, గత రెండేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవనం, అమ్మ ఆదర్శ పాఠశాల సైడ్‌డ్రైన్, సీసీ రోడ్డుతో పాటు పలు అభివృద్ధి పనులు అప్పులు చేసి పూర్తి చేశామన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన వారు ఉన్నామని, ఏళ్లుగా గ్రామ పంచాయతీలో ఉన్న పెండింగ్ బిల్లులతో పాటు మాజీ సర్పంచ్ జీతాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. గిరిజన లంబాడాల ఐక్యవేదిక బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ వసంతరావు, రాథోడ్ కృష్ణ నాయక్, జాదవ్ రామ్ నాయక్, రఘునాథ్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న రూపేష్ రెడ్డి

కై లాస్‌నగర్: బేల మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో గతేడాది ప్రారంభించిన పనులు నేటికీ ప్రారంభం కావడం లేదని, వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల నాయకులతో కలిసి జిల్లా పంచాయతీరాజ్ ఈఈ శివరాంకు వినతి పత్రం అందజేశారు. బేల మండలంలోని టేమ్రిగూడ, దౌనా, పాటగూడ, దేవుజిగూడ, కరోని(కే), రేణిగూడ, కొబ్బాయ్ గ్రామాలకు రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల కోసం టెండర్లు పూర్తయినా.. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదన్నారు. పనులపై దృష్టి సారించి సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడే శంకర్, బోక్రే శంకర్, బోయర్ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'



మాట్లాడుతున్న ఎస్.విలాస్

ఎదులాపురం: రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రైతులు నిరసన చేపడితే ఆయా చట్టాలను రద్దు చేస్తామని పీఎం మోదీ రైతులకు మాట ఇచ్చి ఏడాదిపైగా అవుతున్నా ఇంత వరకు నిలబెట్టుకోలేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అధికారం చేపట్టిన నాటి నుంచి మోదీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించి కార్మికుల నడ్డి విరిస్తోందన్నారు. కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిర్ర దేవేందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ హసీబుల్లాఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని బరంపూర్ జెడ్పీ ఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో సూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బ్యాంకింగ్ పాస్‌వర్డ్, ఓటీపీలను, బ్యాంకింగ్ పిన్, కార్డ్ నంబర్‌ను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అంజమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, గ్రామ పెద్దలు కేదారేశ్వర్ రెడ్డి, సైబర్ క్రైం టీం సభ్యులు రియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- పసి పిల్లలు, వృద్ధులకు మొదలైన తిప్పలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



చలి మంట వద్ద గ్రామస్తులు

బోథ్: చలి చంపేస్తోంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు చల్లటి గాలులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, చల్లని గాలులు వీయడంతో చలి తీవ్రత పెరుగుతోంది. చలి తీవ్రం కావడంతో పిల్లలు, వృద్ధులు, అస్తమా ఉన్న వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

చలి ఉన్నా.. తప్పని పనులు..

తెల్లవారుజామునే పాలు, కూరగాయలు విక్రయించే వారు రక్షణ కవచాలు ధరించి కూడా వణుకుతూనే గ్రామాలకు వస్తున్నారు. పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతూ పాలు సరఫరా చేస్తున్నారు. ఉదయం పూట పనులు చూసే పారిశుద్ధ్య కార్మికులు చలితో ఇబ్బంది పడుతూ గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. చలి ఉన్నా తమ పనులు చేసుకోవాలిసిందేనని వారు పేర్కొంటున్నారు. చలి కారణంతో దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు ఇబ్బంది పడుతూ ఆసుపత్రులకు వెళ్తున్నారు.

విద్యార్థులు, ఉద్యోగుల అవస్థలు..

చలి ఉన్నా.. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులు విధులకు హాజరు కావాల్సిందే. ప్రస్తుతం జిల్లాపై చలిపులి పంజా విసురుతుండడంతో ఉదయాన్నే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, విధులకు వెళ్తున్న ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు కూడా చలికి వణుకుతూనే కూలి పనులకు వెళ్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

అలర్జీ, అస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి. చిన్నారులకు చలిగాలి తగలకుండా చర్యలు తీసుకోవాలి. ఎండ వచ్చిన తర్వాతే బయటకు రావాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 8 గంటలకు ముందు, సాయంత్రం 6 గంటల తర్వాత దూర ప్రయాణాలను రద్దు చేసుకుంటేనే మేలు.

జాగ్రత్తగా ఉండాలి



రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించవద్దు. రాత్రి సమయాల్లో డ్రైవింగ్ చేయకపోవడమే మేలు. చలి తీవ్రత తగ్గే వరకూ నూలుతో తయారు చేసిన దుస్తులు ధరించాలి. చిన్న పిల్లల చేతులకు, కాళ్లకు గ్లౌజులు వేస్తే మరీ మంచిది. అస్తమా ఉన్న వారు చలి ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలి.

– రవీంద్ర ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, బోథ్

ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

- కొత్త మండలాల ఏర్పాటుపై కాంగ్రెస్ సంబురాలు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): కొత్త మండలాలను ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బుధవారం జైనథ్ మండలంలోని సాత్నాల, భోరజ్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రంగినేని శంతన్‌రావు, సంతోష్, రాజేశ్వర్, భూమన్న, నారాయణ, గంగన్న, సురేశ్, దశరథ్, కిష్టు, ప్రశాంత్ రెడ్డి, రాజు, రామన్న, దీపక్, సంటెన్న, శివప్రసాద్, విఠల్, రాందాస్, రఘు, అశోక్, ప్రకాష్, భూమన్న పాల్గొన్నారు.

పశుపోషణపై దృష్టి సారించాలి



నట్టల మందు అందజేస్తున్న ఏడీ రామారావు

తాంసి: రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని జామిడి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ శిబిరం, మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఎదలో ఉన్న పశువులకు ఏడీ వైద్య సిబ్బందితో కలిసి కృత్రిమ గర్భధారణ చేశారు. నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కృత్రిమ గర్భధారణతో జన్మించిన మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించి, వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, సతీశ్, గోపాల మిత్రలు ప్రవీణ్ కుమార్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, రైతులు వినోద్‌రెడ్డి, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో అనేక రుగ్మతలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: రక్తహీనతతో అనేక రుగ్మతలకు గురయ్యే అవకాశం ఉందని, చిన్నారులు, విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని దర్భతండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా గ్రామంలో విద్యార్థులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తహీనత కారణంగా తరచూ అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. కౌమర దశలో ఉండే బాల బాలికలు భవిష్యత్‌లో అనేక రోగాల బారిన పడతారని తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారులకు పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్‌రెడ్డి, ఏఎన్ఎం సౌందర్య, ప్రధానోపాధ్యాయుడు అర్జున్, ఆశ కార్యకర్త సంధ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారించాలని ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బోథ్: సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు బుధవారం గ్రామంలో తిరుగుతూ ప్లాస్టిక్‌ను నివారించాలని అవగాహన కల్పించారు. బుధవారం వారసంత సందర్భంగా ప్లాస్టిక్‌ను నివారించాలని, వాడితే కలిగే ముప్పులను వ్యాపారస్తులకు వివరించారు. పాత బస్టాండ్, అంగడిబజార్, స్థానిక చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన పోస్టర్‌ను మండల మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సొనాల గ్రామంలో ఆవిష్కరించారు. ప్రతీ గ్రామం నుంచి సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎలుక రాజు, జిల్లా కమిటీ సభ్యులు బొబ్బిలి సుధాకర్, బూ ర్గుల సందీప్, సంతోష్, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్, లక్ష్మణ్, సోమన్న, సురేందర్, స్వామి, భీంరావ్ పాటిల్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి), శంకర్ గూడ, ముత్నూర్ గ్రామాల్లో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాపాలన, ప్రజావిజయోత్సవల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిక సారథి కళా బృందం కళాకారులు కుమ్ర నగేశ్, రాథోడ్ శంకర్, ఆత్రం గోవింద్, గోడం ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

పూలే వర్ధంతి నిర్వహించాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రముఖ సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక ఉద్యమ పితామహుడైన మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతిని గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మాలీ కులస్తులు, బహుజన కులాల వారు నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుకుమార్ పెట్కులే సాంబన్న షిండేలు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో మాట్లాడారు. పూలే విగ్రహాలు ఉన్న ప్రతీ చోట వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఆలయాలకు నిధులు మంజూరు

బోథ్: మండలంలోని నేరెడుపల్లె, పరుపుల పల్లె, కొత్తపల్లె, పట్టణంలోని సాయినగర్ జగదాంబా ఆలయం. సంత్ సేవాలాల్ ఆలయాలకు నిధులు మంజూరైనట్లు బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని లింగట్ల, గొండూగూడలో హనుమాన్ మందిరాలకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.1.65 కోట్ల రూపాయలతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి ఆలయ నిర్మాణాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు.

29న సోయా కొనుగోళ్లు ప్రారంభం

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా జరుగుతున్న సోయా కొనుగోళ్లు 29న తిరిగి ప్రారంభించాలని సెంటర్ ఇన్‌చార్జి స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న సోయా పంటను లారీల్లో లోడింగ్ చేస్తామన్నారు. రైతులు గమనించి సోయా పంటను 29న మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని రాఘవేంద్ర, సాయిదత్త, పొచ్చెరలోని సాయిబాబా జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో సీసీఐ కేంద్రాలల్లో గురువారం నుంచి డిసెంబర్ 1వ వరకు నాలుగు రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిల్లుల్లో పత్తి నిల్వలు అధికంగా ఉన్నందున సీసీఐ అధికారులు నాలుగు రోజుల పాటు కొనుగోళ్లు నిలివేయాలన్న సూచనల మేరకు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి డిసెంబర్ 2న పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

నార్నూర్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో జవహర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో భోజనానికి వాడే సరుకుల విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయుడు, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గ్రామస్తులతో సమావేశమైన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్, పీచర, నాగమల్యాల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పువాయిద్యాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రచ్చబండ వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికే పర్యటనలు చేస్తున్నానని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా లేకపోయినా గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేశానని గుర్తు చేశారు. గ్రామస్తుల కోరిక మేరకు రెండు రోజుల క్రితమే గ్రామానికి రెండు హైమాస్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సురేందర్, సంతోష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

హలో మాల.. చలో హైదరాబాద్ పోస్టర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. డిసెంబర్ 1న మాలల సింహగర్జన సభ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో దీక్షా దివస్ చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. అందులో భాగంగానే ఆ ఉద్యమాన్ని గుర్తుచేస్తూ దీక్షా దివస్ కార్యక్రమంతో మరోసారి అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, అష్రఫ్, మెట్టు ప్రహ్లాద్, సాజిత్ ఉద్దీన్, సలీం, జహూర్, ఇజ్జగిరి అశోక్, స్వరూప, మమత, కరుణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

తలమడుగు: రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. బోధనేతర పనుల వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా వెనుకబడుతుందన్నారు. గత 15 రోజుల నుంచి సర్వే పేరున ఒక పూట మాత్రమే బడిలో నడవగా, సర్వే పూర్తయిన అనంతరం ఆన్‌లైన్ పేరిట మరో 15 రోజులు సమయం తీసుకోవడం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. సర్వేల పేరిట, ఆన్‌లైన్ ప్రక్రియ పేరిట ప్రాథమిక ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, శ్రీనివాస్, శంకర్, గంగాధర్, గణేష్, అశోక్, అశోక్, సురేశ్, విజయ్, రవీందర్, భీమ్రావు, నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం'



శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న క్రీడాకారులు

కైలాస్‌నగర్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయనపై అభిమానంతో ముద్రించిన టీషర్టులను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ టీం క్రికెట్ సభ్యులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత భవిష్యత్ పొందాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అఫన్ అహ్మద్, మహమ్మద్, అంకుష్, అరవింద్, కన్నయ్య, షేక్ మొహమ్మద్, నరేశ్ పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏర్పాటుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: గత బీఆర్ఎస్ పాలనలో రెవెన్యూ మండలంగా ఏర్పాటైన సొనాలను మండల ప్రజా పరిషత్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై సొనాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు, కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి గజేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, రమేశ్ బత్తుల, అనిల్, భోజన్న, విజయభాస్కర్ రెడ్డి, గాజుల పోతన్న, కసిరె పోతన్న, పోశెట్టి, హరిసింగ్, గంగారెడ్డి, పవన్, బలిరాం, అంకుష్, అనిత, రాధ పాల్గొన్నారు.

'డిగ్రీ పరీక్ష కేంద్రం బేలలో ఏర్పాటు చేయాలి'



ధర్నాకు మద్దతు తెలుపుతున్న చిట్యాల సుహాసిని రెడ్డి

బేల: కాకతీయ యూనివర్సిటీ అధికారులు బేలలోనే డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన ధర్నాలో ఆమె మద్దతుగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల నుంచి విద్యార్థినులు పరీక్షల కోసం మండల కేంద్రానికి రావడానికే రవాణా సౌకర్యం లేదన్నారు. అలాంటిది జిల్లా కేంద్రానికి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. పరీక్ష కేంద్రాన్ని శాశ్వతంగా మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి, రేసు మనోజ్‌రెడ్డి, గుంజేవార్ మహేశ్, నార్లవార్ అజయ్, బాలాజీ, కన్నె సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.